

# సినిమా న్యూస్

## ఫేక్ ప్రచారానికి చెక్


ఎన్టీఆర్ కార్యాలయం కీలక ప్రకటన చేసింది. 'RAW NTR' సంస్థతో తమకు ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చింది. ఎన్టీఆర్ పేరుతో ప్రకటనలు చేయడానికి గానీ, కార్యక్రమాలు నిర్వహించడానికి గానీ 'RAW NTR'కు ఎలాంటి అధికారం లేదని స్పష్టం చేసింది. ఎన్టీఆర్ కి సంబంధించిన సేవా, ప్రజా సంక్షేమ కార్యక్రమాల వివరాలు కేవలం ఆయన లేదా ఆయన అధికారిక బృందం ద్వారా మాత్రమే వెల్లడి అవుతాయని తెలిపింది. ఈ అంశంపై ఇదే తమ నుండి తుది వివరణ అని స్పష్టం చేసింది.

మీడియా, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వర్గాలు, అభిమానులు ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, కేవలం అధికారిక వర్గాల ద్వారా వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని కోరింది. ఇదిలా ఉంటే ఈ నెల 18న ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశం ఉంటుందని ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. దీంతో మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. సోషల్ మీడియాలోనూ ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ ప్రచారం ఉత్తిదే అని చెప్పేందుకు ఎన్టీఆర్ కార్యాలయం ప్రకటన చేయాల్సిన పరిస్థితి వచ్చింది.



## 'తుంబాడ్-2'లో ఆలియా భట్

2018లో విడుదలైన 'తుంబాడ్' భారతీయ హారర్ చిత్రాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఇక 2024లో రీరిలీజ్ అయినప్పుడు కూడా అద్భుతమైన స్పందనను రాబట్టుకుని భారీ వసూళ్లను రాబట్టిన చిత్రంగా నిలిచి అందరి దృష్టిని ఆకర్శించింది. దీంతో ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కిస్తున్నారు మూవీ మేకర్స్. ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వంలో రాబోతున్న 'తుంబాడ్-2' చిత్రంలో సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రలో నటిస్తున్నారు. సోహమ్ షా ఫిల్మ్స్, పెన్ స్టూడియోస్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. తొలి భాగం కంటే ఈ సీక్వెల్ మరో లెవెల్‌లో ఉండబోతుందనే విషయాన్ని ఇప్పటికే మేకర్స్ స్పష్టం చేశారు. అయితే ఈ సినిమాలో ఆలియాభట్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ పుకార్లకు చెక్ పెడుతూ మూవీ మేకర్స్ అధికారిక ప్రకటనను విడుదల చేశారు. నిర్మాత సోహమ్ షా సోషల్ మీడియాలో కొన్ని క్రేజీ ఫోటోలను పంచుకుంటూ, మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'తుంబాడ్ 2' లోకి ఆలియా అధికారికంగా ఎంట్రీ ఇచ్చిందని కన్ఫర్మ్ చేశారు. ఈ ఫోటోలను షేర్ చేస్తూ సోహమ్ షా.. "ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. 'తుంబాడ్ 2' లోకి ఆలియాకు స్వాగతం. అత్యంత ప్రతిభావంతమైన నటీమణుల్లో ఆలియా ఒకరు. పూర్తిగా ఆమెను కొత్త కోణంలో చూడబోతున్నారు. ప్రళయం రాబోతోంది థియేటర్లలో కలుద్దాం" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చారు.



ఎరుపు రంగు బ్యాక్‌డ్రాప్‌లో అలియా, సోహమ్ కలిసి ఎంతో ఉత్సాహంగా పోజులిచ్చిన ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆలియా భట్ కూడా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'తుంబాడ్'ను మొదటిసారి చూసినప్పటి నుంచి ఆ సినిమా నా మనసులో నిలిచిపోయింది. ఇలాంటి అద్భుతమైన సినిమాలో భాగం కావడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీలతో పని చేసే అవకాశం రావడం చాలా ప్రత్యేకం. 'తుంబాడ్' లాంటి మర్మమైన కథలో కొత్త తరహా పాత్రను పోషించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పుకొచ్చారు. అయితే ఈ సినిమాలో అలియా కేవలం అతిథి పాత్రకే పరిమితం కాకుండా, కథను మలుపు తిప్పే ఒక పూర్తి స్థాయి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. 'ఆల్ఫా'వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఆలియా ఈ చిత్రంలో నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే 'తుంబాడ్-2' కోసం ముంబైలో దాదాపు 7 నుండి 8 ఎకరాల భారీ సెటప్‌ను నిర్మించి, మొదటి భాగంలోని గూస్‌బంప్స్ తెప్పించే 'తుంబాడ్' ప్రపంచాన్ని మళ్లీ సృష్టించబోతున్నట్లు సమాచారం. ఈ భారీ విజువల్ వండర్ సినిమాను 2027 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేశారు.

## 'ఓజీ 2' పరిస్థితి ఏంటి?

వరుస ఫ్లాపుల్లో ఉన్న పవన్ కళ్యాణ్‌కు 'ఓజీ' ఊపిరి పోసింది. సినిమా సూపర్ హిట్ కాకపోయినా బ్రేక్ ఈవెన్ అయింది. వయలెన్స్ హద్దులు దాటినా, పవన్‌కి ఇచ్చిన ఎలివేషన్స్ ఫ్యాన్స్‌కు బాగా నచ్చాయి. పవన్ కెరీర్‌లో ఇంతవరకు 200 కోట్ల సినిమా కూడా లేదు, 'ఓజీ'తో ఫస్ట్ టైమ్ 300 కోట్ల క్లబ్‌లో చేరాడు పవన్. 'ఉస్తాద్' ఫ్లాప్ తర్వాత రెండు సినిమాలు లైన్ లో ఉన్నాయి. సురేంద్ర రెడ్డి దర్శకత్వంలో సినిమా ప్రకటించినా, ఇప్పట్లో ఉండేటట్టు కనిపించడం లేదు. నెక్ట్స్ నటించే సినిమా 'ఓజీ 2' అంటూ పవన్ కళ్యాణ్ అనౌన్స్ చేశారు.

అయితే, దర్శకుడు సుజిత్.. నానితో 'బ్లడీ రోమియో' మూవీకి కమిట్ అయ్యాడు. లేటెస్ట్‌గా పవన్‌కు ఆపరేషన్ జరగడంతో మూడు, నాలుగు నెలల వరకు రెస్ట్ తీసుకుంటాడని.. ఈ లెక్కన 'ఓజీ 2' ఇప్పట్లో ఉండదన్న ప్రచారం నడుస్తోంది. 'ఓజీ' రిలీజ్‌కు ముందే సుజిత్, నానితో 'బ్లడీ రోమియో' మూవీని అనౌన్స్ చేశాడు. అయితే నాని 'పారడైజ్'తో బిజీగా ఉండడంతో సుజిత్ సినిమా పట్టాలెక్కలేదు. 'పారడైజ్' మూవీ ఇప్పట్లో పూర్తయ్యేటట్టు కనిపించడం లేదు. పవన్ కోలుకున్నాక 'ఓజీ 2' పూర్తి చేసిన తర్వాతే 'బ్లడీ రోమియో' తీయనున్నాడు సుజిత్.




పవన్ కళ్యాణ్ సినిమా అంటే ఎప్పుడు మొదలవుతుంది, ఎప్పుడు పూర్తవుతుంది, ఎప్పుడు రిలీజ్ అవుతుందో చెప్పలేం. త్వరలోనే మరో భుజానికి కూడా ఆపరేషన్ చేయాల్సి ఉంది. మూడు నెలల పాటు రెస్ట్ తీసుకుంటాడా, లేదంటే ఆరు నెలలు తీసుకుంటాడో తెలీదు. గ్యాప్ ఎంత వచ్చినా 'ఓజీ 2' పూర్తయిన తర్వాతే సుజిత్ 'బ్లడీ రోమియో' తీస్తాడని తెలిసింది.

## 'ధురంధర్'కు ఊహించని దెబ్బ

ధురంధర్ సినిమా బాక్సాఫీస్ ను షేక్ చేసిన సంగతి తెలిసిందే. ఇండియా, పాకిస్తాన్ మధ్య గొడవల నేపథ్యంలో వచ్చిన ప్రతి సినిమా బంపర్ హిట్ అయ్యాయి. అదే తరహాలో వచ్చిన ఈ ధురంధర్ సినిమా రెండు పార్టులు మంచి విజయాన్ని సాధించాయి.




అలాంటి ధురంధర్ సినిమాకు జపాన్ లో ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఈ సినిమాను ఈ నెల 10వ తేదీన జపాన్ లో రిలీజ్ చేశారు. ఈ క్రమంలో తొలి రోజు 900 టికెట్లు మాత్రమే సేల్ అయ్యాయి.

ఓవరాల్ గా తొలి 3 రోజులలో జపాన్ లోని టాప్-25 సినిమాల సరసన కూడా ధురంధర్ చోటు దక్కించుకోలేక.. చెత్త రికార్డు నమోదు చేసుకుంది. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా జరుగుతుంది. ఇండియాలో దాదాపు 3 వేల కోట్లు సాధించిన ధురంధర్, జపాన్ లో పెద్దగా కలెక్షన్స్ రాబట్టక పోవడంతో చిత్ర బృందం నిరాశకు గురైంది. కాగా అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 మూవీ ఆ దేశంలో తొలి రోజు కేవలం 886 టికెట్లు బుక్ అయ్యాయి. అదే ఆర్ఆర్ఆర్ సినిమాకు అత్యధికంగా 8230 టికెట్లు బుక్ కావడం గమనార్హం.